నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 11, 2025 | www.navatelangana.com

కలెక్టర్ ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

ఆసిఫాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పిటిజి కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శుద్ధమైన తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అత్యవసర సేవలను వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు బస్సులు నడిపిస్తున్నారన్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



బాడీ బిల్డింగ్ పోటీల విజేతకు సన్మానం

మందమర్రి : బాడీ బిల్డింగ్‌లో ప్రథమ బహుమతి సాధించిన అక్షయ్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లో ఈ నెల 9న బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుండి 100 మందికి పైగా పాల్గొన్నారు. మందమర్రికి చెందిన అక్షయ్ 70కేజీల విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. పట్టణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం అక్షయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంద తిరుమలరెడ్డి, రాయబారపు కిరణ్, బియ్యపు రవికిరణ్ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్చార్జిలు సురేందర్, అన్వేష్, పసునూరి రాము, మణిదీప్, చింటూ, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యల పరిష్కారం కోసం మాలీలు ఐక్యంగా ముందుకు సాగాలని అఖిల భారత మాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగోషే శంకర్ అన్నారు. జిల్లా కేంద్రాల్లో అఖిల భారత మాలి మహా సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, ఎంఆర్పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలీలను ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగా ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. దీంతో పాటు మాలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లుంబిని దీక్ష భూమి నాయకులు దుర్గం తిరుపతి, అఖిల భారతీయ మాలి మహా సంఘ జిల్లా అధ్యక్షులు గుర్నులే మెంగాజి, ఉపాధ్యక్షులు మారుతీ, జిల్లా ప్రధాన కార్యదర్శి సెండే సోమేశ్, యువజన జిల్లా అధ్యక్షులు మొహర్లే శ్రీకాంత్, ఉమ్మడి జిల్లా పటేళ్ల అధ్యక్షులు శెండే నారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు కావుడే దత్తు, మండల అధ్యక్షులు అదే బాబురావు, యువజన జిల్లా నాయకులు మొహర్లే తుకారాం, కొత్రంగే సాగర్ పాల్గొన్నారు.

కనిపించకుండా పోయి..శవమై తేలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ వ్యక్తి కనిపించకుండా పోయి శవమై తేలిన ఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మావల ఎస్ఐ గౌతమ్ వివరాల ప్రకారం..మావలకు చెందిన షేక్ ఫర్వేజ్(22) పెట్రోల్ పంపులో పని చేస్తుండేవాడు. ఆదివారం ఉదయం ఇంటి నుండి బయలుదేరి రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం మావల ఎర్రకుంట చెరువులో శవమై కనిపించాడు. అటుగా వెళ్తున్న స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. గోనె సంచిలో మృతదేహం ఉండడంతో హత్యగా అనుమానిస్తున్నారు. అయితే అలాంటిదేమీ లేదని, సూసైడ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బేల

మండలంలోపి కొబ్బాయి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం సరదాగా క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఎందరో యువకులు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ సౌకర్యాలు లేకపోవడంతో అవకాశాలను కోల్పోతున్నారన్నారు. క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులలో గ్రామీణ క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు దత్త నిక్కం, మురళీధర్, గణేష్, నవీన్, రాకేష్, రత్నాకర్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

పోరాటం ఫలితంగానే బాపూజీ పేరు సాధన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో తాము చేసిన పోరాటాల ఫలితంగానే జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ తెలిపారు. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి మంత్రి మల్లారెడ్డికి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు, స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతి పత్రాలు ఇచ్చి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. దీంతోనే మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ప్రభుత్వం తాజాగా ప్రకటించిందని అన్నారు. బాపూజీ పేరును మెడికల్ కళాశాలకు ప్రకటించడం పద్మశాలీల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడంతో పాటు జిల్లాకు చెందిన పోరాట యోధుడికి గౌరవం ఇచ్చినట్లు అయిందన్నారు. బాపూజీ పేరును ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామ మాజీ సర్పంచ్ సాయగౌడ్ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం పారిశ్రామికవేత్త మోహన్‌రావు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, నాయకులు రవికిరణ్‌గౌడ్, శేఖర్, హన్మాండ్లు, మెునాజీ, రాములు, పోశెట్టి ఉన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేసి కాలువలు నిర్మించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేసి కాలువలు నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్ధా నదిపై ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించాలని, కుమురం భీం ప్రాజెక్టు కాల్వల నిర్మాణం పూర్తి చేసి ఇప్పటికే నిర్మించిన కాలువల పూడిక తీయించాలని, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలని, వట్టివాగు, ఎర్రవాగు, ఎన్‌టిఆర్ సాగర్ ప్రాజెక్టుల నుండి రైతులకు నీరు అందించేలా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరానికి తరలించి జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిందన్నారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వార్ధా నదిపై ప్రాజెక్టును నిర్మించి జిల్లా రైతాంగానికి నీరు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వార్ధా నదిపై ప్రాజెక్టును నిర్మించేందుకు నీటిపారుదల శాఖ రూ.4550.00 కోట్ల వ్యయంతో 1,40,742 ఎకరాలకు నీరు అందించవచ్చని ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదని పేర్కొన్నారు. 2025-26 బడ్జెట్లో సంవత్సరానికి కనీసం రూ.1000 కోట్ల చొప్పున కేటాయిస్తే ఐదు సంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. 45 వేల ఎకరాలకు నీరందించే విధంగా రూ.882.36 కోట్ల అంచనాతో కుమురం భీమ్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తుందని, గత వర్షాకాలంలో ప్రాజెక్టు దెబ్బతినగా మరమ్మత్తులు చేయకపోగా టర్పాలీన్‌లు కప్పారని తెలిపారు. కాల్వల నిర్మాణం పూర్తి కాలేదన్నారు. జగన్నాథ్ పూర్ ప్రాజెక్ట్ పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. వట్టి వాగు ప్రాజెక్టు ద్వారా 24500 ఎకరాలకు నీరు అందించేందుకు రూ.89.36కోట్లు ఖర్చు చేశారని, 12500 ఎకరాలకు నీరు అందినట్లు చెబుతున్నప్పటికీ సింగరేణి కబ్జా వల్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలోని ప్రాజెక్టులపై దృష్టి సారించి అధికారులను అప్రమత్తం చేసి అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించి జిల్లా రైతాంగానికి నీరందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గొడిసెల కార్తీక్, రాజేందర్, సాయికృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) బృందం

ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్ సోమవారం పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, గౌస్ ఆలం నుండి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున సరిహద్దుపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా క్రిమినల్ యాక్టివిటీస్ లేకుండా నియంత్రించడం, శాంతి భద్రతల పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. రౌడీలు, గ్యాంగులు లేకుండా హిస్టరీ షీట్లను ఓపెన్ చేసి ప్రతిరోజు వారిని పర్యవేక్షిస్తూ నియంత్రిస్తామని తెలియజేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై, జిల్లాలో సంఘవిద్రోహ శక్తుల సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజలు, పోలీసులు, మీడియా అందరూ కలిసికట్టుగా జిల్లా ఉన్నత స్థానానికి ఎదిగేలా కృషి చేయాలని తెలిపారు. అదనపు ఎస్పీ బి. సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, హసీబుల్లా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్పీకి ఘన స్వాగతం పలికారు.

టోల్‌ప్లాజా కార్మికులను కొనసాగించాలి



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

టోల్ ప్లాజా నిర్వాహక కంపెనీ కార్మికులతో చర్చలు జరపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ కోరారు. సోమవారం గంజాల్, నేరడిగొండ, పిప్పరవాడ టోల్ ప్లాజాల్లో పనిచేసే కార్మికుల ముఖ్య నాయకులతో జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఫిబ్రవరి 14 నుంచి టోల్ ప్లాజాలను పాత కంపెనీ నుంచి కొత్త కంపెనీ అయిన ఫేర్వెల్ టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ టేకవర్ చేసుకోవడం జరిగిందన్నారు. 15 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్మికులకు పాత కంపెనీ ఒప్పందం ప్రకారం జీతం ఇస్తున్నారని, కానీ ఈ కొత్త కంపెనీ పాత జీతాలు ఇవ్వకపోగా ఉన్న వాటిలో తగ్గించి ఇస్తుందని తెలిపారు. కొత్త కంపెనీ 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారిని తీసుకోకుండా కొత్త ఉద్యోగులను తీసుకుంటామని నోటిఫికేషన్ ఇవ్వడం కార్మికుల పొట్ట గొట్టడమేనని తెలిపారు. ఇప్పుడు పని చేస్తున్న కార్మికులందరినీ యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గంజాల్ యూనియన్ అధ్యక్షులు రమేష్, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, శ్రావణ్, రాజ్‌కుమార్, నేరడిగొండ టోల్ ప్లాజా కార్మికుల అధ్యక్షులు లక్ష్మణ్, పిప్పరవాడ టోల్ ప్లాజా కార్మికుల అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులు విధులకు హాజరు కావాలి



నవతెలంగాణ-మందమర్రి

కేకే-5 గని గైర్హాజరు కార్మికులు విధులకు హాజరు కావాలని నాగాల పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దని కేకే 5 గని ఇన్‌చార్జి మేనేజర్ రమేష్ తెలిపారు. సోమవారం కేకే 5 గనిపై గైర్హాజరు కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విధుల వద్ద ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. భూగర్భ కార్మికులు ప్రతినెల 16 మస్టర్లు, ఉపరితల కార్మికులు 20 మస్టర్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతినెల కౌన్సెలింగ్ ఉంటుందని, తరచూ విధులకు గైర్హాజరు అయి మస్టర్లు లేక డిస్మిస్ అయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు. డిస్మిస్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అనారోగ్యంతో పాటు ప్రమాదాల బారిన పడి గాయాలు మానినప్పటికీ ఒళ్ళు నొప్పులు ఉన్న కార్మికులల పైఅధికారుల దృష్టికి తీసుకెళితే తాత్కాలికంగా సర్ఫేస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. విధులకు గైర్హాజరవుతూ వారి కుటుంబాలకు, ఇటు సంస్థకు భారం కావద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారిణి రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య పాల్గొన్నారు.

ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో విషాదం

- అనుమానాస్పదంగా విద్యార్థిని మృతి
- బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ధర్నా

నవతెలంగాణ -ఇచ్చోడ, బోథ్

మండల కేంద్ర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని చిక్రం లాలిత్య(14) అనుమానాస్పదంగా మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బజార్‌హత్నూర్ మండలం మొరుకండి గ్రామానికి చెందిన లాలిత్య ఇచ్చోడ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. ఆదివారం రాత్రి 11గంటలకు నిద్రలోనే చనిపోయింది. సోమవారం ఉదయం 7గంటలకు విద్యార్థిని నోటినుండి నురగ వచ్చింది. దీంతో ప్రధానోపాధ్యాయులు ఉత్తమ్‌దాస్ విద్యార్థిని తండ్రి రాజేశ్వర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. బాలిక తల్లిదండ్రులు రాజేశ్వర్, లక్ష్మి వెంటనే ఆశ్రమ పాఠశాలకు చేరుకున్నారు. నోటి నుండి నురగ రావడంతో నిద్రలోనే ఫిట్స్ వచ్చి ఉంటుందని అనుమానిస్తున్నారు. మరేదైనా కారణం ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. బాలిక మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తండ్రి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎ.తిరుపతి తెలిపారు.



మృతి చెందిన విద్యార్థిని లాలిత్య

గిరిజన బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ధర్నా

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బాలిక లాలిత్య అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించి, కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్మ సమాజ్ పార్టీ, సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట బైటాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బోథ్ పట్టణ అధ్యక్షులు ఎల్.నరేష్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు ముస్సిఫ్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు వెంకటేష్, కార్తీక్ పాల్గొన్నారు.



బోథ్‌లో ఆందోళన చేస్తున్న డీఎస్‌పీ, సీపీఐ, ఐఏఎస్‌ఎఫ్ నాయకులు

మౌలిక వసతులకు నిషాన్‌ఘాట్ వాసుల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిషాన్‌ఘాట్‌లో కనీస సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఆదిలాబాద్ రూరల్ మండల సీపీఐ కార్యదర్శి బత్తుల గంగారెడ్డి, సహాయ కార్యదర్శి మెస్రం భాస్కర్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్కా దేవిదాస్ మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 8,9 సంవత్సరాల నుండి పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. విషపురుగుల మధ్య భయం భయంగా బతుకులు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర వసతులు కల్పించేలా కలెక్టర్, ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు గేడం కేశవ్, ప్రజానాట్య మండలి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణస్వామి, నిషాన్‌ఘాట్ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.సంగీత, గేడం పొచ్చిరాం, ఆత్రం అంగీత, షభానా, నిస్సార్, సాగర్, రేణుక, ఖలీల్, రమేష్ చౌహన్, సునీత, సర్పం క్రిష్ణ, సునీత, కాంబ్లె మారుతీ, హుస్సేన్, తుడుం భూమన్న, సాంబశివ్ పాల్గొన్నారు.



దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దివ్యాంగులకు ప్రస్తుతం అందిస్తున్న సదరం సర్టిఫికెట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూనిక్ డిజేబులిటీ ఐడి(యుడిఐడి) అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి అధికారులు దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధుల అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడి ఇవ్వనుందని, ఇప్పటి వరకు 7 కేటగిరీలలో సదరం సర్టిఫికెట్లు అందిస్తుండగా ఇకనుండి 21 కేటగిరీలకు సంబంధించి యూనిక్ డిజేబులిటీ ఐడి కార్డులు ఇస్తామని తెలిపారు. ఈ సేవల వినియోగానికి మార్చి 1 నుంచి అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని ప్రతి దివ్యాంగులు కార్డు కొరకు మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలని, సదరం ధ్రువపత్రం కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దత్తారావు, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్యాధికారులు, అడిషనల్ డీఆర్‌డీఓ రామకృష్ణ, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య పాల్గొన్నారు.

ఆలయానికి నగదు విరాళం అందించిన శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



మామడ మండలంలోని పొన్కల్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సోమవారం రూ.లక్ష వెయ్యి నూట పదహార్లను విరాళంగా అందజేశారు.అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు భుజంగా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న, ఏనుగు లింగారెడ్డి, సామ వికాస్‌రెడ్డి, కాళగిరి గంగారెడ్డి, బాపయ్య ప్రతాప్‌రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, సల్కం శేఖర్‌రెడ్డి, నర్సారెడ్డి, ఉమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూమేష్, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎలగడప గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఉట్నూర్‌లోని వారి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహీం, మహమ్మద్ సలీం, మాజీ సర్పంచ్ భూమేశ్ ఉన్నారు.



ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ఆమె పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ లకు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ భూ సంబంధిత, అటవీ, వ్యవసాయం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, పెన్షన్, రేషన్ కార్డులు వంటి దరఖాస్తులను పరిష్కరించాలని ప్రజలు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్ : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన అశోక్ లోన్ సౌకర్యం కల్పించమని కోరారు. సిర్పూర్(యు) పంగిడి గ్రామానికి చెందిన శ్యాంరావ్ తనకి బోరు బోరుబావి, విద్యుత్ మంజూరు చేయించాలని కోరారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీఓ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీఓ ఏపీజీ మిశ్రమ మనోహర్, ఈఈ తానాజీ ఏఓ దామోదర్ స్వామి, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరూ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్, సాత్నాల మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటివరకు 18 రామాలయ నిర్మాణాలు జరిగాయని పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాలలో పండగ వాతావరణంతో పాటు ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్, సంతోష్, రత్నాకర్‌రెడ్డి, ఆదిత్య, సురేష్, సుభాష్, వసంత్, జ్ఞానేశ్వర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



నవతెలంగాణ-నేరడిగొండ

గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన బొడిగే ఆదర్శ్(26) ఆదివారం రాత్రి 11 : 30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై నేరడిగొండ వైపు నుంచి నిర్మల్ వైపు వెళుతుండగా మార్గమధ్యలో బొరిగామ బస్ స్టాప్ వద్ద ద్విచక్ర వాహనం ముందు ఉన్న గుర్తు తెలియని వాహనాన్ని అతివేగంతో వెళ్లి వెనక నుంచి అతి వేగంతో ఢీ కొట్టడంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో బోడిగే ఆదర్శ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం మేరకు కుటుంబీకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్



పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

పార్టీలకతీతంగా నూతన సిరికొండ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉప ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీల నూతన భవన నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ రాజకీయ అనుభవం ఎక్కువగా ఉన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి అధికార పార్టీ అండదండలతో, రెండు నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాలతో కలిసి ఏర్పాటు చేసిన నూతన మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. మండలంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని ఆరోగ్యపరమైన సమస్యల కోసం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూ.కోటి 43 లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణ పనులకు ప్రతి పక్ష ఎమ్మెల్యేతో కలిసి భూమిపూజ చేయడం సంతోషకరమని అన్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే భేదం లేకుండా మండలాన్ని సామరస్య పూర్వకంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అనేది నిజమైన లబ్ధిదారుడికి అందేలా చూస్తామని అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్న ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. వాటి పరిష్కారానికి, అలాగే మండలాభివృద్ధికి అధికార పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి పని చేస్తామని అన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు, ఇచ్చోడ నుంచి మండల కేంద్రానికి వచ్చేందుకు త్వరలోనే డబుల్ రోడ్డు నిర్మాణం, చిక్మాన్ ప్రాజెక్టు రీడిజైన్ చేస్తామని అన్నారు. ఎన్నికలు వచ్చే సమయంలోనే పార్టీలని మిగతా సమయంలో అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ ఫణీందర్‌రావ్, పంచాయతీ రాజ్ డీఈ రాజేశ్వర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీఓ రవీందర్, ఏపీఎం సంతోష్, నాయకులు పెంటన్న, ఇక్బాల్, ఇమామ్, చందు, బొడ్డు దత్తు, కదం సూర్యకాంత్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిరికొండ

ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, అనిల్ జాదవ్‌లను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలు అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆర్ఎంపీలకు శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఆర్ఎంపీలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, చెప్పి కొంత అమౌంట్‌ను రిలీజ్ చేశారని, అయినప్పటికీ శిక్షణ తరగతులు నిర్వహించలేదని అన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తన మేనిఫెస్టులో ఆర్ఎంపీలకు శిక్షణ తరగతులు నిర్వహించి, సర్టిఫికెట్లను అందజేసి, వారిని గుర్తిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇంత వరకు ఎటువంటి గుర్తింపు పత్రాలు ఇవ్వలేదని, ప్రభుత్వం స్పందించి తమకు శిక్షణ తరగతులు నిర్వహించి, గుర్తింపు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు లక్కం మల్లేష్, ఓం ప్రకాష్, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రాళ్లబండి శంకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ చెందిన కాంగ్రెస్ నాయకుడు మారుతి కుమారుడు వినోద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వారి ఇంటికి వెళ్లి వినోద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకముందు ముత్నూర్ గ్రామవాసి కాంగ్రెస్ నాయకుడు రుతిక్ అమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మెన్ ముఖాడే ఉత్తం, వైస్ చైర్మెన్ మారుతి, పట్టణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తనయుడు వినోద్, మాజీ సర్పంచ్ సుంకటరావు, కాంగ్రెస్ నాయకులు జితేందర్, జునేద్ ఉన్నారు.

ఫూలే దంపతులను భారతరత్నతో గౌరవించాలి

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే



ఫూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మాలీ మహా సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న బిరుదు ప్రకటించి, గౌరవించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలో జ్ఞాన జ్యోతి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని సంఘ సభ్యులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలేల విగ్రహాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1848 జనవరి ఒకటో తేదీన మహారాష్ట్రలోని పూణే నగరంలోని భిడేవాడలో మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు స్త్రీల కోసం మొదటి మహిళా పాఠశాలలను ప్రారంభించి, స్త్రీ సాధికారిత కోసం, సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆమె త్యాగ ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రగతి భవన్ పేరు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా మార్చి ప్రజాపాలన అందిస్తున్నదని ఇది చాలా మంచి శుభ పరిణామమని పేర్కొన్నారు. వారికి భారతరత్నతో గౌరవించాలని అన్నారు. అలాగే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అన్నారు. పూలే వారసులైన మాలి కులస్తులకు గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ నూతన ఎమ్మెల్సీలు ఇచ్చిన మాట ప్రకారం కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న మాలీల ఎస్టీ హోదా బిల్లును వెంటనే ఆమోదింపజేసి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురుజులే, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు అడ్వొకేట్ ఉమేష్‌రావు డోలే, మాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులు అనిల్ కొట్రంగే, శీను ఆచారి, హరీష్ గురునులే, భాస్కర్ ప్రధాన్, నందిని గురునులే పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మండలంలోని 31మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పలు ఆలయాలకు, సంఘ భవనాలకు, మార్కండేయ టెంపుల్, ముదిరాజ్ సంఘం, గురుడ కాపు సంఘం, ఎక్‌నాథ్ టెంపుల్, గ్రామంలో సీసీ రోడ్డు, వీర హనుమాన్ ఆలయానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, తక్కల రమణారెడ్డి, ముత్యంరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జంగం వీరేష్, శైలేశ్వర్, చంద్రకాంత్, మండలాధ్యక్షులు నర్సారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సయ్య భూమేశ్, రాజలింగం, నిరంజన్‌రెడ్డి, దీక్షత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



వైద్యశిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ఆరోగ్యంపై మహిళలందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచడానికి, అలాగే వారి సంక్షేమాన్ని మెరుగుపరచడానికి వైద్య శిబిరం ఎంతో సహాయపడుతుందని అన్నారు. బీపీ, కంటి, రక్తపరీక్షలు, వైద్య సేవలు అందించడం మహిళా ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో కీలకమైనవని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మహిళల సాధారణ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన చికిత్సలను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వైద్యులు కలెక్టర్‌కు బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ మహిళా శక్తి క్యాంటీన్‌లో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టిస్టాల్‌ను కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రాజేందర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, డీపీఆర్వో విష్ణువర్ధన్, డీసీహెచ్ఎస్ డా. బి.సురేష్, ఏఓ సూర్యారావు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ తీరుకు నిరసనగా రైతుల పొర్లుదండాలు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ముందు 78 రోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పట్టించుకోని కలెక్టర్ తీరుకు నిరసనగా సోమవారం జాదవ్ మోతీరాం రైతు తన కుటుంబ సభ్యులతో కలెక్టర్ కార్యాలయంలో పొర్లుదండాలతో నిరసన తెలిపారు. లోకేశ్వరం మండలంలోని పుస్పూర్, నరసింహనగర్ తండ నివాసి జాదవ్ మోతీరామ్, జాదవ్ కిషన్‌లు తండ్రి కొడుకులు తమ పేరిట పది ఎకరాల పట్టా భూమి కలిగి ఉంటే ఆ భూమి నుంచి ఎకరన్నర భూమిని గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొని క్రీడా ప్రాంగణం బోర్డు పెట్టి రైతుకు నష్టం చేసింది. ఆనాటి నుండి రైతు పోరాటం చేస్తూనే ఉన్నాడు.





పొర్లు దండాలు పెడుతున్న రైతు కుటుంబ సభ్యులు

జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యల పరిష్కారానికి దారి చూపకుండా కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్నారు. దీనిని నిరసిస్తూ జాదవ్ మోతీరామ్ ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడండ్లు, మనవరాళ్లు కలెక్టర్ కార్యాలయానికి పొర్లుదండాలు పెడుతూ లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లోకి వచ్చిన కలెక్టర్ రైతుతో మాట్లాడి 20న మీ ఊరికి మీ భూమి చూడటానికి, సమస్య పరిష్కారం చేయడానికి వస్తానని చెప్పారు. దీనితో ఆ రైతు తిరిగి మళ్లీ ఎప్పటిలాగే కలెక్టర్ గేటు ఎదుట రిలే నిరాహార దీక్ష శిబిరంలో కూర్చున్నాడు. ఈ కార్యక్రమంలో వారికి మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి మద్దతు తెలిపారు.

అధికార సమావేశంలో కార్యకర్తలు కూర్చోవడం సరికాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే పాయల శంకర్ అధికారికంగా నిర్వహించిన సమావేశంలో వారి పార్టీ కార్యకర్తలు సమావేశంలో కూర్చోవడం సరికాదని వారిపైన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్లు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కూడా కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో బీజేపీ కార్యకర్తలు కూర్చున్నారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా వీరిపై ఆదేశాలు జారీచేయాలని కోరారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో జహీర్ రంజాని, కలాల శ్రీనివాస్, చందా నర్సింగ్, బండారి సతీష్, లక్ష్మణ్, రామ్ కుమార్, ఇమ్రాన్, భూమన్న, ఆవుల వెంకన్న, జాఫర్ హైమద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | మార్చి 11, 2025 | www.navatelangana.com

ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ఈవీఎం గోదాం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పులాజీ బాబా ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని సిరియన్ మోవాడ్ గ్రామంలో గల పూలాజీ బాబా ధ్యాన కేంద్ర వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్రం అధ్యక్షుడు అర్జున్, గ్రామ పటేల్ వేడమాబాదు, సింగిల్ విండో మాజీ చైర్మన్ అలీబిన్‌అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంధం శ్రీనివాస్, మాజీ సర్పంచులు భీమేష్, బాబురావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు : కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజావాణి ద్వారా వస్తున్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే క్రమ శిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను హెచ్చరించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. విభాగల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. వేసవి దృష్ట్యా జిల్లా కార్యాలయాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనుల జరిగే చోట మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వేసవిలో తాగునీటి సమస్యను తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డులోని తపాలా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టుమాస్టర్ యోగేష్ కుమార్ తివారి అన్నారు. సోమవారం తపాలా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆధార్ సెంటర్ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, ఇతర సవరణలు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

సాయి విద్యాలయం ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఇది వరకు ఉపాధ్యాయుడిగా పని చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన రాచర్ల సంతోష్‌ను సోమవారం ఆ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బందం శాలువాలతో, పూలబోకిలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దీకొండ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ నాలుగేండ్ల పాటు హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా బోధించారని, పాఠశాల అభివద్ధి కోసం ఎంతో కష్టపడ్డాడని అన్నారు. ఇందులో ఉపాధ్యాయులు దీకొండ విజయ కుమారి, తిరుపతి, హిమబిందు, మౌనిక, మంజు, దేవిక ఉన్నారు.

దేశీదారు విక్రయిస్తూ పట్టుబడ్డ మహిళకు జరిమానా



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని బెల్సార్‌రాంపూర్ గ్రామానికి చెందిన సురేఖ దేశిదారు విక్రయిస్తు గతంలో ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడటంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దేశదారు విక్రయించవద్దని పోలీసులు చెప్పినప్పటికీ సదరు మహిళా తన ప్రవర్తన మానుకోకుండా మళ్లీ దేశిదారు విక్రయిస్తూ పట్టుబడటంతో ఆమెకు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించారు. సురేఖ లక్ష రూపాయల చలన్ ద్వారా ప్రభుత్వానికి సోమవారం జమ చేసినట్టు సీఐ విజేందర్ తెలిపారు.

స్ఫూర్తిదాయక అంశాలపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో మండలంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకల పాఠశాల, కళాశాలలో సోమవారం విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి ఆదేశానుసారం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ సూచనలతో మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు మోటివేషనల్ ట్రైనర్ సుందిల్లా రమేష్ తెలిపారు. అనంతరం విద్యార్థినులకు నైతిక విలువలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ మోటివేషన్, టైం మేనేజ్‌మెంట్, బాలికా విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి రంగంలో ధైర్యంగా ముందడుగు వేయాలని, ఆడపిల్ల లేనిదే సమాజం లేదని, అనుకుంటే ఆకాశమే హద్దుగా ఏదైనా సాధించగలరని, లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాలని సూచించారు. తదనంతరం సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందులో ప్రిన్సిపల్స్ చైతన్య, వైస్ ప్రిన్సిపల్ రజిత, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలను సాధించాలి



వాంకిడిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలీ సంఘం నాయకులు

నవతెలంగాణ-వాంకిడి

భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిబాయి పూలే సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఆమె ఆశయాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులే, బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహెూల్కర్ అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి అనంతరం మాట్లాడారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని భావించి భర్తతో కలిసి 1848లో పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యత, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేసిన ధీర వనిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెంగాజీ, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, ఎస్సై ప్రశాంత్, బౌద్ధ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వినేష్, మండల బౌద్ధ మహాసభ అధ్యక్షుడు జయరాం, సమాజ అధ్యక్షుడు విలాస్, రాజేంద్రప్రసాద్, మాలీ సంఘం మండలాధ్యక్షుడు బాబురావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు ఉగ్రే వినయ్, అరుణ్, శివాజీ, ప్రతాప్, ఇంద్రజిత్, రమేష్, రాజేశ్వర్, దుర్గం మనోజ్, జాడే రమేష్, దుర్గం చింటూ, బల్వంత్, భీంరావు, నాగ్‌సేన్, దివాజీ పాల్గొన్నారు.

వాంకిడి:

భారతీయ తొలి మహిళ ఉపాధ్యాయురాలు, మహాత్మా జ్యోతిబాపులే సతీమణి సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సెండే వాసు అన్నారు. సోమవారం మండలంలోని కిరిడి గ్రామంలో మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమె 128వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఇందులో గ్రామ అధ్యక్షుడు సెండే హనుమంతు, గ్రామ పటేల్ గుర్నులే మెంగాజీ, మాజీ వైస్ ఎంపీపీ సెండే రాజ్‌కుమార్, మొహర్లే ఓమాజీ, మాజీ ఉప సర్పంచ్ సాగర్, నగోసే మారుతి, వసంత్‌రావు, నాగోసే సాంబయ్య, రాంచందర్, సామాజిక సేవా సమితి అధ్యక్షుడు సెండే శ్యాంరావ్, చందు, దిలీప్, లలిత్, శ్రీకాంత్, అన్నారావ్ పాల్గొన్నారు.

కెరమెరి:

సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కషి చేయాలని మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసి రామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే భవనంలో సావిత్రిబాయి పూలే 128 వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా విద్యాభివద్ధి కోసం పాటుపడిన మహనీయురాలని తెలిపారు. గొప్ప సామాజిక సంస్కర్త, ఉపాధ్యాయిని, కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు సెడ్మకి తుకారాం, సంఘం నాయకులు సెండే నారాయణ్, కొట్రంగే తిరుపతి, వాడై సుధాకర్, పెందూర్ శ్రీనివాస్, సోనేరావు పాల్గొన్నారు.

రెబ్బెన:

మండలంలో కొండపల్లి గ్రామంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి వేడుకలను పూలే సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిప్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మోర్లే తిరుపతి, మాజీ ఎంపీటీసీ రఘుపతి, సమితి సభ్యులు మధుకర్, సంతోష్, శ్రీను, మోతిరావు, శ్యాంరావు పాల్గొన్నారు.



కెరమెరిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలీ సంఘం నాయకులు

బాడీ బిల్డింగ్‌లో మండల వాసికి మొదటి స్థానం



నవతెలంగాణ-తిర్యాణి

మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గుండం లక్ష్మణ్ మరో ఘనత సాధించారు. తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన 75 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. మారుమూల ప్రాంతమైన తిర్యాణి మండలంలో జన్మించి అటు ఉద్యోగంలో రాణిస్తూ ఆయనకు క్రీడలపై ఉన్న మక్కువతో బాడీ బిల్డింగ్‌పై దృష్టి సారించి గతంలో ఎన్నో పోటీల్లో జిల్లాతో పాటు మండలానికి మంచిపేరు తీసుకొచ్చారు. తన ఖాతాలో మరో విజయాన్ని సైతం జమ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. తన సాధనలో కుటుంబ సభ్యులతో పాటు సహచర ఉద్యోగులు, మండల ప్రజలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని ఈ సందర్భంగా లక్ష్మణ్ పేర్కొన్నారు.

ముగిసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ లోయర్ డ్రాయింగ్ పరీక్ష ముగిసింది. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ జనకాపూర్ పాఠశాల నుంచి నుంచి 11 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 8 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ కమిషనర్ ఉదయబాబు సోమవారం విద్యార్థులకు మార్కుల మెమోలను అందజేసి అభినందించారు. డ్రాయింగ్ హయ్యర్ పరీక్షను పూర్తి చేసి ఉన్నత వత్తి విద్య కోర్సులకు, ఉద్యోగ అవకాశాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఇందులో ఉపాధ్యాయులు ధర్మపురి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, మల్లికార్జున్, సంతోష్, సోనేరావు, విజేష్, రవీందర్, మారుతి, ప్రవీణ్, సంజయ్, రవిత, స్వప్న, సులోచన, భారతి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం

నవతెలంగాణ-బోథ్

గిరిజన బాలిక చిక్రం లాలిత్య కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంతో పోరాటం చేస్తాం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చిక్రం లాలిత్య ఆదివారం రాత్రి అనుమానస్పదంగా మృతిచెందింది. కాగా మృతురాలిని పోస్ట్‌మార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వాస్పత్రి తరలించిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్షం వల్లే మరో ఆదివాసీ బిడ్డ చిక్రం లాలిత్య మృతి చెందిందన్నారు. సంబధిత అధికారులను కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అంత్యక్రియలకు తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ :

ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం అనే పేరుతో వసతి గృహల్లో వార్డెన్‌లు డ్యూటీలో లేకపోవటంతో ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. నాయ విచారణ జరిపించాలని, ఘటనకు కారకులైన వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దాడులను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భీమ్ ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌పై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ అహ్మద్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌తో పాటు వినయ్ రతన్ సింగ్‌పై దాడులను ఖండిస్తూ సోమవారం జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇందులో పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడి రాజు, అనిల్, సూర్యవంశీ, సందీప్, మహేశ్వర్, జావిద్, అనిస్, సుమిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అనారోగ్యంతో మృతి చెందిన వర్కర్‌కు సంతాపం

నవంతెలంగాణ-రెబ్బెన

జీఎం ఆఫీసులోని ఐటీ డిపార్ట్‌మెంట్‌లో బదిలీ వర్కర్‌గా పని చేస్తు దురదష్టవశాత్తు అనారోగ్యం బారినపడి హైదరాబాద్ నీమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన రూబీనా తారన్నమ్‌కు జీఎం ఆఫీసు ఉద్యోగులు సోమవారం సంతాపం ప్రకటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆమె అతిచిన్న వయసులో(32ఏళ్లకే) మృతిచెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటనలు మరలా జరగకూడదని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి తమ శరీరాన్ని, మానసిక ఆరోగ్యాన్ని దృఢంగా ఉంచుకోవాలని ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఇందులో పర్సనల్ మేనేజర్ రెడ్డి మళ్ల తిరుపతి, ఐటీ డిపార్ట్‌మెంటు హెచ్ఓడీ ముజీబ్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఉమాకాంత్, ఫైనాన్స్ మేనేజర్ రవి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

135 శాతం ఉత్పత్తి సాధించిన ఖైరిగూడ

నవతెలంగాణ-రెబ్బెన

ఉత్పత్తి లక్ష్యాల దిశగా ప్రతి ఉద్యోగి తన వంతు కషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం ఖైరిగూర ఉపరితల గనిని సందర్శించారు. ఫిబ్రవరి నెలలో నిర్దేశించిన లక్ష్యానికి 135 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు గని ఉద్యోగులను అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 37.5 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి ఇంకా 21 రోజులే మిగిలి ఉందని ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. ఇందులో ప్రాజెక్టు ఆఫీసర్ మచ్చగిరి నరేందర్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ బయ్య మొగిలి, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, సేఫ్టీ ఆఫీసర్ నారాయణ, గని మేనేజర్ శంకర్ డెప్యూటీ, పీఎం వేణు, ఏఐటీయూసీ నాయకులు శేషు, దివాకర్, కిరణ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోడ కూలి కూలీ మృతి

నవతెలంగాణ-రెబ్బెన

పాత ఇల్లు కూల్చేక్రమంలో గోడ కూలి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని నవేగాం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వోల్వే తిరుపతి పాత ఇంటిని కూల్చేందుకు కూలీగా వచ్చిన మూడెం లక్ష్మయ్య (70) గోడ కూలి అందులో ఇరుక్కుపోయాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్స్ కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

సెపక్‌తక్రాలో సత్తాటిన మండల పోలీసులు

నవతెలంగాణ-రెబ్బెన

హర్యాణలోని కర్నాల్ ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ సెపక్ తక్రా ఛాంపియన్ షిప్‌లో రాష్ట్ర సెపక్ తక్రా పోలీస్ టీం కాంస్య పతకం సాధించినట్లు రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ టీమ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కొమురం భీమ్ రెబ్బన మండలానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఆర్. వెంకటేష్, ఆడే.రాజేందర్, పి.గోపి పాల్గొనడం ఎంతో గర్వకారణంగా పేర్కొన్నారు. ఈ ముగ్గురు సెపక్ తక్రా క్రీడలో రాష్ట్ర జట్టు తరపున ఎన్నో నేషనల్స్ ఆడి పతకాలు సాధించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఒలంపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్. ఆర్ నారాయణ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎస్. తిరుపతి, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి శిరీష, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లు. భాస్కర్, రామకష్ణ, మల్లేష్, షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, శంకర్, సాంబయ్య, చందర్ రెడ్డి, సతీష్, హరిలాల్, మల్లేష్, శ్రీధర్, అనిల్ గౌడ్ వారికి అభినందనలు తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని గొల్లఘట్, తాంసి గ్రామ సమీపంలోని పెన్ గంగా నది ఒడ్డున గల పురాతన ఆలయమైన గిరిజాబాయి ఆలయాభివద్ధి కోసం తన వంతు సహకారంగా సోమవారం వడూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చిలుకూరి సంజీవరెడ్డి రూ.11వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంతో పురాతమైన గిరిజాబాయి ఆలయం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో నమ్మకంతో కొలుస్తారని అన్నారు. ఆలయంలో వసతుల ఏర్పాట్ల కోసం విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్, అశోక్, కాశిరాం ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



నవతెలంగాణ-జైపూర్

టేకుమట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణిని స్థానికులు సోమవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఇటీవల కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా శ్రావణి ప్రశంసా పత్రం అందుకున్నారు. గ్రామ పంచాయతీ కారాల్యంలో ఏర్పాటు చేసిన వేదిక మీదుగా పంచాయతీ కార్యదర్శిని శాలువాలతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వర లక్ష్మి, నాయకులు నర్సయ్య, సురేందర్, రమేష్, వినోద్, రఘుపతి, ప్రవీణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

నవతెలంగాణ-జన్నారం



సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, ఎస్ఐ రాజవర్ధన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూ సమస్యల వినతులను పోలీస్, రెవెన్యూ అధికారులు కలిసి ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏపీఓ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో కొరవడిన రక్షణ చర్యలు

- ప్రాణాలు పణంగా పెడుతున్న కార్మికులు
- జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యం బాధ్యత వహించాలి
- మృతుని కుటుంబాలనికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలి



రాంచందర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

నవతెలంగాణ-జైపూర్

భూగర్భ గనుల్లో రక్షణ చర్యలు కొరవడుతున్నాయని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. సోమవారం ఇందారం-1ఏ గనిలో మృతి చెందిన జనరల్ మజ్దూర్ పసునూరి రాంచందర్ మృతి విధి నిర్వాహణలో భాగంగా మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. యాక్టింగ్ మ్యాన్ రైడింగ్ విధులు నిర్వరిస్తున్న రాంచందర్ ఉన్నట్టుండి కుప్పకూలిపోగా స్థానికంగా ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం ఆయన మృతికి కారణమని కార్మికులు పేర్కొంటున్నారు. అస్వస్థత చెందిన రాంచందర్‌ను అండర్ గ్రౌండ్ నుండి బయటకు తీసుకొస్తున్న క్రమంలో మృతి చెందినప్పటికీ సింగరేణి ఆసుపత్రిలో వైద్య సేవలు అందించామని అధికారులు మృతిని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 9 గంటలకు జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎవ్వరికి తెలియనీయకుండా ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించామని అధికారులు అబద్దాలు చెబుతున్నారని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా



రాంచందర్(ఫైల్)

ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆరోపించారు. విధి నిర్వాహణలో ఉన్న జనరల్ మజ్దూర్ రాంచందర్ అనుమానస్పద మృతిగా అభివర్ణించారు.

వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు

ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో భూగర్భ గనుల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నారన్న ఆరోపనలు విన్పిస్తున్నాయి. మృతి చెందిన రాంచందర్ హార్ట్ ఎటాక్‌తో కుప్పకూలిపోయాడని పేర్కొంటుండగా స్థానికంగా ప్రాథమిక వైద్యం అందించే ఏర్పాట్లు చేసివుంటే రాంచందర్ మృతి చెందకుండా ఉండేవాడని కార్మికులు పేర్కొంటున్నారు. ఇదే గనిలో గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా యాజమాన్యం కార్మికుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొంటున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి భూగర్భ గనుల్లో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తున్న కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘం కార్మికులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.

గని ప్రమాదంగా పరిగణించాలి

గని ప్రమాదాలకు సింగరేణి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని కార్మిక సంఘాలు హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ డిమాండ్ చేస్తున్నాయి. కార్మికుల మృతికి యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేనట్లుగా రిపోర్టులు తయారు చేసుకుంటున్న స్థానిక అధికారులు యాజమాన్యాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. విధి నిర్వాహణలో ఉన్న రాంచందర్ మృతి గని ప్రమాదంగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. మృతుని కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలని, విధి నిర్వాహణలో ఉన్న కార్మికులు ఏ కారణంగా మృతి చెందినా అది గని ప్రమాదంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీరో మ్యాన్ రైడింగ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్ గుండెపోటుకు గురైనట్లు అనుకున్నా ప్రాథమికంగా వైద్య సేవలు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత యాజమాన్యంపై లేదా అని ప్రశ్నిస్తున్నారు. సీపీఆర్ పట్ల అవగాహణ ఉన్న వారు అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ప్రాణాలు నష్టపోవల్సి వస్తోందని, గతంలో శ్రీనివాస్ అనే కార్మికుడు ఇదేవిధంగా మృతి చెందినట్లు వారు పేర్కొంటున్నారు. ఇందారం గని ప్రమాదానికి సంబంధించి సమాచారం అడిగేందుకు గని మేనేజర్ నాగన్నకు ఫోన్ ద్వారా పలుకరించే ప్రయత్నం చేయగా ఆయన స్పందించకపోవడం బాధాకరం.. రెండవ సారి ప్రయత్నిస్తే ఆయన నెట్‌వర్క్ ఏరియా అవతలివైపు ఉన్నట్లు తెలియవచ్చింది.

స్థానిక అధికారులను బదిలీ చేయాలి

ఇందారం-1ఏ గని, ఓపన్‌కాస్ట్ గని అధికారులను ఇక్కడి నుండి బదిలీ చేయాలని హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్మికులపై పని ఒత్తిడి పెంచి వారి మృతికి కారకులవుతున్నారని, ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతుండగా అధికారులు యాజమాన్యాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ఇక్కడి అధికారుల తీరుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

నిరుపేద కుటుంబానికి యూత్ ఫర్ సొసైటీ సభ్యులు సోమవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. దీపక్ నగర్‌కి చెందిన వడ్లూరి శంకర్ విజయలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, ఒక కొడుకు కూతురు మరుగుజ్జు తనంతో వికలాంగురాలు, భర్త శంకర్ మెదడుకు సర్జరీ కావడం, కుడి కాలు, కుడి చెయ్యి పక్షవాతంతో నడవలేని పరిస్థితి, అత్త వృద్ధురాలు అవడంతో మంచానికే పరిమితమైంది. దీనితో ఇంటి భారమంతా విజయలక్ష్మి మీద పడటంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం యూత్ ఫర్ సొసైటీ సభ్యులు తెలుసుకొని నెలకు సరిపడా నిత్యవసర సరుకులను బాధిత మహిళకి అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు రాయబారపు కిరణ్, సురేందర్, ఓజ్జ గణేష్, చోటు, మహేష్, అన్వేష్, చింటూ, కిరణ్, బన్నీ, శరత్ కుమార్, షారుక్ పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సంబరాలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని స్థానిక విశ్రాంతి భవనంలో సోమవారం అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయటంపై జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన సందర్భంగా నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎంపిక అవ్వడమే కాకుండా రాబోయే రోజుల్లో మరింత ఉన్నత పదవులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెండం రాజు, తొగరు కాంతయ్య, మినుముల శాంతి కుమార్, జాతీయ మాల మహానాడు మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

స్వయం సహాయక బృందాల సభ్యులు, రైతులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. చిర్రకుంట గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ శాఖ ప్రతినిధులు బిఎల్ రాయుడు, ఎం హరీష్‌లు డిజిటల్ చెల్లింపులు జరిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ చెల్లింపులు జరిపే దేశాల్లో భారతదేశం ముందుందని ఇందుకు పొదుపు సంఘాల మహిళలు కూడా కారణమని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల ద్వారా డిజిటల్ యుగంలో ఒక కొత్త అధ్యాయం మొదలైందని, ఇప్పుడు రైతులు కూడా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్లో అమ్మేటప్పుడు, విత్తనాలు, ఎరువులు తదితర అవసరాలకు డిజిటల్ విధానాల ద్వారానే చెల్లింపులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీబీ మందమర్రి శాఖ ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, గుండె రామచందర్ పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులను అరెస్టు చేయాలి

- హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగరావు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడా గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగడ్డంగూడా గ్రామంలో గిరిజన ఇండ్లను కూల్చివేసిన, అటవీ శాఖ అధికారుల అరెస్టు చేసి శిక్షించాలని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆ గిరిజన గ్రామానికి వెళ్లి, పరిస్థితులను ఆరా తీశారు. సుమారు 150 మందికిపై అటవీశాఖ అధికారులు దాడి చేయడం చట్ట ఉల్లంఘన అవుతుందన్నారు. గత 30 సంవత్సరాల నుంచి అక్కడే తమ ఇండ్లను వేసుకొని నివాసం ఉంటున్న వారిని అర్ధాంతరంగా రాత్రిలో రెండు గంటల సమయంలో విద్యుత్ బంద్ చేసి జేసీబీ ట్రాక్టర్లతో కూలగొట్టడం సరికాదన్నారు. 30 సంవత్సరాలలో లేని అటవీ ఆంక్షలు ఇప్పుడే వచ్చాయని, ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి గుడిసెలను పూర్తిగా జేసీబీ ట్రాక్టర్లతో తొలగించడంతో, వారిని అటవీశాఖ అధికారులు నానా బూతు మాట్లాడడంతో అవమానానికి గురైన గూడానికి చెందిన రాథోడ్ బలిరాం పురుగుల మందు తాగాడన్నారు. అతడు ఒక్కడే కాదు మీరంతా పురుగుల మందు తాగి చావండి అనడం అటవీశాఖ అధికారుల దౌర్జన్యానికి పరాకాష్ట అన్నారు. అటవీ శాఖ అధికారులపై



అటవీ అధికారులు తొలగించిన ఇండ్లను పరిశీలిస్తున్న అత్రం భుజంగరావు

గూడెం వాసులు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోకపోవడం, హేమమైన చర్య అన్నారు. అటవీ శాఖ ప్రభుత్వం ఉన్నత అధికారులు వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందిస్తూ కూల్చిన గుడిసెలను నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరేణి సామాగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఏరియా స్టోర్స్‌లో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు సోమవారం మండలంలోని తాండూర్ సర్కిల్ కార్యాలయం వద్ద నిందితుల వివరాలను వెల్లడించారు. గ్రామాల్లో తిరుగుతూ సబ్బులు, సర్ఫులు అమ్ముకునే మందమర్రికి చెందిన మోతే రాజయ్య, మోతే నరసయ్య, మోతే తిరుపతి, మధు అనే నలుగురు వ్యక్తులు ఈ సంవత్సరం జనవరి 8వ తేదీన గోలేటి ఏరియా వర్క్ షాప్ లో సింగరేణి అధికారులు నిల్వ ఉంచిన ఇత్తడి పరికరాలు ఏడింటిని దొంగిలించారని తెలిపారు. సింగరేణి అధికారులు తెలిపిన ప్రకారం వీటి విలువ 6.22 లక్షల ఉంటుందన్నారు. సింగరేణి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు, వారు అందించిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. సోమవారం ముందస్తుగా సమాచారం మేరకు మండలంలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద గస్తీ నిర్వహించగా మందమర్రి నుంచి తాండూర్ వైపుకు రెండు మోటర్ బైక్‌లపై వచ్చిన ఈ నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి వద్దనుంచి ఇత్తడి పరికరాలను కరిగించి ముద్దగా చేసిన రెండు ఇత్తడి ముడి సరుకులను, బైక్ లను స్వాధీనం చేసుకొనన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ సౌజన్య పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో మల్లిఖార్జున స్వామి ఆలయ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవ కుటుంబాల వారితో పురోహితులు విశ్వేశ్వర శర్మ, తిరునగరి ప్రవీణ్‌లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ కుల సంఘం అధ్యక్షుడు కోల కిష్టయ్య, ఉపాధ్యక్షుడు కొమ్ము విజయరాజు, కేశవేని పున్నం, ప్రధాన కార్యదర్శి రాపెల్లి రాజన్న, కోషాధికారి దారవేని తిరుపతి, సొసైటీ అధ్యక్షుడు ఆవుల సురేష్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కుల సభ్యులతో కలిసి భూమి పూజ చేసి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. దాతల సహాయ సహకారాలతో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు కుల సంఘం అధ్యక్షడు కోల కిష్టయ్య తెలిపారు. ప్రాథమికంగా రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. కాగా మల్లిఖార్జున స్వామి ఆలయ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి యాదవ కుటుంబాల వారితో పాటు స్థానిక నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ కుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

గని ప్రమాదంగా గుర్తించాలి

నస్పూర్ : జైపూర్ మండలంలోని ఇందారం-1ఏ గనిలో సోమవారం పసునూరి రామచందర్ జనరల్ మజ్దూర్ అనే కార్మికుడు విధినిర్వహణలో గనిలో చనిపోయాడని ఆయన మృతి గని ప్రమాదంగా ప్రకటించి ఎహెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజి, ఆర్కే-7 ఫిట్ కార్యదర్శి శ్రీధర్ వేరు వేరు పత్రికటలో డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుని గని ప్రమాదంగా గుర్తించి రూ.కోటి స్పెషల్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

రామగుండం సీపీగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో శాంతి భద్రతల పరిరక్షణకు 24 గంటల పాటు పని చేస్తామని రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వచ్చిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీస్ కమీషనరేట్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు ముందుగా సాయుధ పోలీసులు ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇక్కడి నుంచి బదిలీపై వెలుతున్న కమీషనర్ శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించగా కమీషనరేట్ పరిధి పోలీస్ ఉన్నతాధికారులు కొత్తగా వచ్చిన కమీషనర్ అంబర్ కిషోర్ ఝాను కలిసి మర్యాదపూర్వంగా పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అదే కాకుండా ల్యాండ్ మాఫియా, డ్రగ్స్, గంజాయి వంటి నేరాలకు పాల్పడిన వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అదే సమయంలో సామాన్యులకు న్యాయం జరిగేవిధంగా నడుచుకోవాలని, పోలీసులను ఆశ్రయించిన వారి సమస్యలకు సత్వర సేవలు అందించాలని సూచించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ

భూ తగాదాలపై ప్రజావాణి



నవతెలంగాణ-మందమర్రి

భూ తగాదాలపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడునని తహసీల్దార్ సతీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మంచిర్యాల ఆదేశానుసారం పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం భూ తగాదాలపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడునని, అర్జిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి

నవతెలంగాణ-దండేపల్లి

పేద మధ్య తరగతి విద్యార్థులందరినీ ఒకే గొడుగు కిందికి తెచ్చి కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాలల భవన నిర్మాణాకి నిధులు కేటాయించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు వర్షం వ్యక్తం చేశారు. తొలి విడుదలలో భాగంగా 50 గురుకులాలకు నిదుల కేటాయించడంతో మండలంలోని రెబ్బెనపల్లి గ్రామంలో నిర్మించనున్న సమీకృత గురుకుల పాఠశాల భవనానికి నిధులు కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధి లక్ష్యంగా తమ నాయకుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు పనిచేస్తున్నారని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని ఆయన అన్నారు. మండలంపై ఎనలేని ప్రేమాభిమానంతో రెబ్బనపల్లి గ్రామంలో సమీకత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి స్థలం ఎంపిక చేశారని దీంతో మండలం అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీని ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యేలు పాఠశాలలోని సౌకర్యాలను, ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచిస్తూ, ఏటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణను మొత్తం సందర్శించారు. ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, మండలాధ్యక్షులు బరుకుంట నరేందర్, నాయకులు సవీన్, దత్తురాం, సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్, రాజు, గంగారాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి చింతగూడ గ్రామంలో పంద్రా గంగాధర్ రైతు ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఇవా ఫౌండేషన్ సంస్థ ద్వారా నెలకు సరిపడ సరుకులు సంస్థ డైరెక్టర్, సామాజిక కార్యకర్త బండ నితిన్, కొమ్ము విజయ్ న్యాయవాది అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ సలీం, నాయకులు అంజద్‌ఖాన్, పడిదెం శ్రీకాంత్, కలీముద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే వెడ్మ ఫౌండేషన్ ఏర్పాటు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజా సేవకై వెడ్మ ఫౌండేషన్‌ను నిర్మితమైందని, నా శేష జీవితం పేద బడుగు బలహీన వర్గాలకు అంకితమని వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వెడ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిస్సాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సేవ చేయాలన్న తపనతో వెడ్మ ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటికే అనేకమంది నిస్సాయ స్థితిలో ఉన్న పేదలకు ఆర్థిక చేయూతను అందించామని, భవిష్యత్తులో మరింత సేవ చేయడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులకు, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలువడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులు తమ పంట పొలాలలో రసాయానిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. స్త్రీల విద్యాభివృద్ధికి వారు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ప్రతి మహిళ సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకుని, వారి అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం 14మంది డిగ్రీ కళాశాల విద్యార్థులకు పీజీ ప్రిపరేషన్ కోసం పుస్తకాలను అందజేశారు. నిరుపేదలకు దుప్పట్లతో పాటు రైతులకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండలాధ్యక్షులు కాయ్యుమ్, జాదవ్ కృష్ణ, గాయకుడు మోహన్ నాయక్, కరీం, చంద్రయ్యా, రాజేష్, నగేష్, వెడ్మ ఫౌండేషన్ సభ్యులు, మార్కెట్ కమిటి చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, మాజీ మున్సిపల్ చైర్మెన్లు, పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ సమీపంలోని నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక క్రీడాపోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి మహిళ తన సామర్థ్యాన్ని ప్రదర్శించి విజయాలను సాధించాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు సమాన హక్కులు పొందాలని, క్రీడల్లోనూ వారిది విశేషమైన స్థానం అని అన్నారు. ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు క్రీడలు ఎంతో మేలు చేస్తాయని, మహిళా శక్తిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించిన కలెక్టర్ మహిళలతో కలిసి చెస్, క్యారం, టెన్నిస్ ఆటలను ఆడారు. వివిధ క్రీడా విభాగాల్లో అధిక సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మహిళలు, నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్స్ నందకుమార్, పోతన్న, కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మామడ మండలం పొన్కల్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ రాజ గోపురం, సుదర్శన చక్ర ప్రతిష్టాపన సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, మండలాధ్యక్షులు రంజిత్, కొండ్రు రాజారెడ్డి, నాయకులు బాపురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సత్యం చంద్రకాంత్, రాజేశ్వర్, నరేష్, గంగారెడ్డి, తిరుపతిరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్ కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ భార్గవి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ అనే అంశంపై కంప్యూటర్ లాంగ్వేజ్ వచ్చే ఇంటర్వ్యూ ప్రశ్నల సరళిపై విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం భార్గవిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘుగణపతి, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ అధ్యాపకులు గజానన్, కుణాల్ యాదవ్ బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళాభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి సావిత్రీబాయి పూలే

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రవికుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు విద్యాభ్యాస చేసేలా ప్రయత్నించిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాల మహిళలు విద్యకు దూరంగా ఉన్న సమయంలో వారిని చైతన్యపర్చారని తెలిపారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పనిచేసిశారని తెలిపారు. మనువాదాన్ని ధిక్కరించి మహిళల అభ్యున్నతి కోసం పోరాడిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. భర్త జ్యోతి బాపులే ప్రోత్సాహంతో అనేక ఉద్యమాలను నిర్వహించారన్నారు. నేటి పాలకవర్గాలు మాత్రం మహిళా హక్కులను కాలరాస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన మనువాద భావజాలంతో మహిళలను రెండవ తరగతి పౌరులాగానే చూస్తోందన్నారు. ఈ మధ్యకాలంలో మహిళలపై జరిగిన ఆఘాయిత్యాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలపై రోజురోజుకు దాడులు తీవ్రతరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యద్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గొడిసెల కార్తీక్, చాపిలె సాయిక్రిష్ణ, జాదవ్ రాజేందర్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ సీపీఐ(ఎం) కార్యాలయంలో సావిత్రిబాయి పూలేకు నివాళి

మాలీ సంఘ కార్యాలయంలో

జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ మాలి మహా సంఘ కార్యాలయంలో సావిత్రిబాయి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ మాలి సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగోశే శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్నులే నారాయణ, బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు రమేష్ రూపనార్, రైతు సంఘ జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతి పటేల్, యువజన జిల్లా అధ్యక్షులు మోహర్లే శ్రీకాంత్, శెండే నారాయణ పాల్గొన్నారు.



లక్సెట్టిపేట : అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళ్లు అర్పిస్తున్న యువకులు

జన్నారం : మహిళాసమాజానికి విద్యా బుద్ధులు నేర్పడానికి తొలి ఉపాధ్యాయురాలిగా వ్యవహరించిన సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రములో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ సావిత్రి భాయి పూలేని ఆదర్శంగా తీసుకుని నేటి మహిళా సమాజం ఆమె బాటలో నడిచి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని అన్నారు. బీసీ ఉద్యమ కులాల పోరాట సంఘం ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఐలవేణి రవి, కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపే నర్సింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నరసయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, ఖానాపూర్ నియోజకవర్గ కోకన్వీనర్ ఆంద్ర పురుషోత్తం పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : వివక్ష లేని సమాజ నిర్మాణం కావాలని తన జీవితాంతం పోరాడిన వీర వనిత సావిత్రి బాయి పూలే అని అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు చాతరాజు రాజన్న పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మోదెలలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని అంబేద్కర్ యువజన సంఘం, మోదెల కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు, మోదెల అధ్యక్షుడు సామనపల్లి దుర్గాంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు భైరం లింగన్న, ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి సుధాకర్, కండె మొగిలి, మంచాల కుమార్, మోదెల ప్రధాన కార్యదర్శి మామిడి ప్రదీప్, తోట రమేష్, చాతరాజు శివ కుమార్, చాతరాజు రాజేష్, లింగంపల్లి శ్రీకర్, చాతరాజు సంతోష్, చిన్నయ్య పాల్గొన్నారు.

దేవాపూర్‌లో..

కాసిపేట : మండలం కేంద్రంలోని దేవాపూర్ నాయకపు గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని కార్యక్రమాన్ని ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్ పోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపూ, గ్రామ పెద్ద మనిషి రొడ్డ రాజ యశ్వంత్ మహారాజ్, భూ నిర్వాసితుల సంఘం నాయకులు బోగె పోశం, ఎస్ఎఫ్ఐ నాయకులు కొమ్ముల రజిత, మహిళా సంఘాల నాయకులు మేసినేని అర్చన, రొడ్డ లక్ష్మి మహిళా, ప్రధానోపాధ్యాయురాలు నవీన, కొమ్ముల సంజీవ్, సంద్ర మహేష్, రొడ్డ పోషక్క, పాల్గొన్నారు.

తాంసి : మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం మండల కేంద్రంతో పాటు గిరిగాం గ్రామంలో మాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో కలిసి నిర్వహించారు. మండల కేంద్రంలోని పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలి యువజన సంఘం అధ్యక్షులు అశోక్, మాజీ సర్పంచ్ కృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, మాజీ ఎంపిటిసి నరేష్, మాలి కుల సంఘం సభ్యులు గంగారాం, విఠల్, రవి, దీపక్ పాల్గొన్నారు.



కాసిపేట : దేవాపూర్‌లోని నాయకపుగూడ ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలేకు నివాళి

భూ తగాదాల అర్జీల స్వీకరణ



తాండూర్‌లో..

నవతెలంగాణ-తాండూర్

తహసీల్దార్ కార్యాలయాలంలో సోమవారం రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన భూ భూతగాదాల పరిష్కార వేదికలో ఒక్క దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భూమి తగాదాలకు సంబంధించిన వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తులపై 15 రోజు ల్లోగా క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పర్యవేక్షించి సమస్యకు పరి ష్కారం చూపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం ఎస్ఐ సౌజన్య ఆర్ఐ ఎజాజుజొద్దీన్ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ జ్యోత్స్న భూతగాదాల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మహేందర్, వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, ఉపాధి హామీ ఏపీఓ ఎస్తార్ డేవిడ్, ఐకేపీ ఏపీఎం శ్యామల మిషన్ భగీరథ ఏఈ రక్షిత రెవిన్యూ వైద్య శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట : భూ తగాదాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కలక్టర్ ఆదేశానుసారం ప్రజావాణీలో సోమవారం దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ భోజన్న తెలిపారు. ప్రతి సోమవారం పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కలిసి ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మొత్తం నాలుగు దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఏఓ చల్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

దండేపల్లి : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఎస్ఐ ఆధ్వర్యంలో కమిటీ వేసి సివిల్ తగదాల పరిష్కారం చూపనట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు తీసుకొని పరిష్కారం చూపేందుకు కమిటీ పని చేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తహసినుద్దీన్, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : లక్సెట్టిపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ఏ దిలీప్‌కుమార్ తెలిపారు. ప్రజలకు భూసమస్యలతో పాటు ఎలాంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు ఉన్నా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే తక్షణమే అట్టి దరఖాస్తును సంబంధిత అధికారిచే పరిశీలించి సమస్య పరిస్కారం చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఎంపీడీఓ సరోజ, ఎస్ఐ సతీష్, ఏఓ శ్రీకాంత్, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో..

గిరిజనుల అభివృద్ధికి భూమి దానం

నవతెలంగాణ-బేల

మండలంలోని దేవుజీగూడ గ్రామానికి చెందిన తుంరం బాపూరావ్ తన ఆరు ఎకరాల పొలంలో నాలుగు గుంటల భూమిని ప్రభుత్వానికి దానం చేశారు. ఈ సందర్భంగా బేల తహసీల్దార్ రఘునాథ్‌రావ్ తుంరం బాపూరావ్‌కి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రఘునాథ్ రావ్ మాట్లాడుతూ దేవుజీగూడ గ్రామంలో గత సంవత్సరం అత్యంత వెనుకబడిన పీవీటీజీ గిరిజనుల కొరకు ఐటీడీఏ తరపున రూ.60లక్షలతో మల్టీపార్పస్ బిల్డింగ్ మంజూరు అయిందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ స్థలం లేక పోవడంతో పనులు ముందుకు కొనసాగలేదన్నారు. దీంతో గ్రామానికి వెళ్లి గిరిజనులతో మాట్లాడి వారికీ అవగాహన కల్పించినట్టు తెలిపారు. వెంటనే తుంరం బాపూరావ్ గిరిజనుల అభివృద్ధి ఫలాలు వెనక్కి వెళ్లదనే ఉద్దేశంతో తనకున్న ఆరు ఎకరాల పొలం నుంచి నాలుగు గుంటల భూమిని ప్రభుత్వానికి దానం చేయడం పట్ల వారికీ బేల తహసీల్దార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సిడాం వామన్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సాత్నాల మండలంలోని రామాయి శ్రీకోదండ రామాలయ విగ్రహ ప్రతిష్టపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్, వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతిపై న్యాయవిచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సాయి అన్నారు. సోమవారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బజార్‌హత్నూర్‌కు చెందిన విద్యార్థిని ఆదివారం రాత్రి డిన్నర్ తరువాత స్టడీ అవర్ నుంచి వచ్చి పడుకుందని అలానే మృతి చెందిందని డ్యూటీ టిచర్ వార్డెన్ చెప్పుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం అనే పేరుతో వసతి గృహల వార్డెన్ డ్యూటీలో లేకపోవటం వల్లనే ఈ మృతి జరిగి ఉంటుందని ఆరోపించారు. ఏదేమైనా విచారణ జరిపించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత వారం రోజుల క్రితమే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పీఓను కలిసి సంక్షేమ వసతి గృహాలలో పర్యవేక్షణ లోపం వల్ల హాస్టల్‌లో వార్డెన్ రోజు వారిగా డ్యూటీకి రావటం లేదని ఆమె దృష్టికి తీసుకువెళ్లామన్నారు. విద్యార్థి ఆరోగ్యం పట్ల సరైన అవగాహన లేకపోవటం వల్లనే విద్యార్థి మీతి చెంది ఉంటుందని పేర్కొన్నారు. న్యాయపరమైన విచారణ జరిపించాలని, కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. అలాగే వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సక్కు, గణేష్, సాయి, కిరణ్, నగేష్, విశాల్, తరుణ్, మహేష్, పాల్గొన్నారు.

కుటుంబానికి న్యాయం చేయాలి

చనిపోయిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఇచ్చోడలో 9వ తరగతి విద్యార్థి చనిపోవడం బాధాకరమన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో గిరిజన సంస్థ పరిధిలో అనేకమంది విద్యార్థులు చనిపోతున్న కూడా ఐటీడీఏ అధికారులు పీఓ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే బాధ్యతరహితంగా ఉన్నటువంటి ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్‌లపై తక్షణమే చర్యలు తీసుకొని సర్వీస్ నుంచి తొలగించాలని అన్నారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రెషియాతో పాటు ఐటీడీఏ సంస్థలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు దీపాలక్ష్మి, జిల్లా నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఇచ్చోడలోని ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని లాలిత్య అనుమానస్పదంగా మృతి చెందడంతో ఆమె మృతిపై వెంటనే విచారణ జరపాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ అన్నారు. అనంతరం ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తాకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలుగా విద్యార్థికి జ్వరం ఉండటంతో హాస్టల్ వార్డెన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెప్పడంతో పట్టించుకోకపోవడంతో వాళ్ల నిర్లక్ష్యం ద్వారా విద్యార్థిని మృతి చెందిందన్నారు. మృతికి కారణమైన హాస్టల్ వార్డెన్, ప్రధానోపాధ్యాయురాలపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, విద్యార్థి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్: మాట్లాడుతున్న సాయి

నేరడిగొండ : విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని చిక్రమ్ లాలిత్య అనుమానస్పదంగా మృతి చెందిందన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.20లక్షల నగదుతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో లైవ్ నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ పాండు నాయక్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వసంత్‌నాయక్, నేరడిగొండ మండల ఇన్‌చార్జ్ సందీప్ నాయక్ పాల్గొన్నారు.